సాక్షి అనకాపల్లి

మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



ప్రతి అర్జీకి విచారణ 8లో

కలెక్టరేట్ స్పందనకు 178 వినతులు వచ్చాయి. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో విచారించాలని కలెక్టర్ ఆదేశించారు.



ఘనంగా సారె ఊరేగింపు

గర్నికం బాలచెంచమ్మతల్లి తీర్థాన్ని మంగళవారం నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామంలో సోమవారం సారె ఊరేగించారు. 8లో



వైద్య విజ్ఞాన వనం

ఆంధ్రా వైద్య కళాశాల ఎన్నో విశిష్టతల సమాహారం. ఎంతో మంది వైద్యులు, స్పెషలిస్టులను అందించింది. 10లో

న్యూస్‌రీల్

ప్రణాళికాయుత ఆర్థిక ప్రవర్తనపై అవగాహన



ఆర్థిక అక్షరాస్యత వారోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ కల్పనాకుమారి, ఎల్‌డీఎం సత్యనారాయణ

తుమ్మపాల : ప్రతి ఒక్కరు ప్రణాళికాయుత ఆర్థిక ప్రవర్తనను అలవరచుకోవాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవ పోస్టర్‌ను జేసీ కల్పనాకుమారి, ఎల్‌డీఎం సత్యనారాయణతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా మంచి ఆర్థిక ప్రవర్తన–మీ రక్ష అనే థీమ్‌తో ఈ 17వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆర్థిక లావాదేవీలు, బ్యాంకింగ్ సేవలు, రుణాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బ్యాంకింగ్ అధికారులను సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో పి.వెంకటరమణ, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఈ- క్రాప్ నమోదు పురోగతి పరిశీలన



వడ్డాదిలో ఈ -క్రాప్ నమోదుపై విచారణ చేస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో ఈ – క్రాప్ నమోదుపై వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు, అనకాపల్లి ఏడీ ఎస్. రామారావు సోమవారం తనిఖీ చేశారు. పలువురు రైతుల పొలాల్లోకి వెళ్లి పంటలను పరిశీలించారు. వరి, చెరకు, మినప, నువ్వు, తదితర పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు, భూమి స్వభావం, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో, మండలంలో ఉంటున్న వ్యవసాయ శాఖ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. వీరు అందుబాటులో ఉండి సూచనలు, సలహాలతో పాటు ప్రభుత్వ రాయితీ విత్తనాలు అందిస్తున్నారని పలువురు రైతులు వివరించారు. రైతు భరోసా కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ నెల 20వ తేదీలోగా ఈ – క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో భాస్కరరావు సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సంతోష్, ప్రసాద్, భాగ్య పాల్గొన్నారు.

జీడీఏ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ: ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో పైనాపిల్‌కాలనీ దరి జిల్లా మహిళా ప్రాంగణంలో జనరల్ డ్యూటీ అసిస్టెంట్(జీడీఏ) కోర్సులో శిక్షణకు ఈనెల 20లోగా దరఖాస్తులు చేసుకోవాలని మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ పి.విమలకుమారి తెలిపారు. మూడు నెలల శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 30 సంవత్సరాలు మధ్య వయసు గలవారు శిక్షణకు అర్హులన్నారు. శిక్షణలో చేరినవారికి ఉచిత బస్‌పాస్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 8523874274, 8333921337 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

జీవీఎంసీ బడ్జెట్ సమావేశం వాయిదా

దాబాగార్డెన్స్ (విశాఖ): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు ఈ నెల 15న నిర్వహించనున్న జీవీఎంసీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం వాయిదా వేస్తున్నట్టు కార్యదర్శి పి.నల్లనయ్య ప్రకటనలో తెలిపారు. తదుపరి సమావేశం తిరిగి నిర్వహించే తేదీ, సమయం సభ్యులకు తెలియజేస్తామన్నారు.

యువకునిపై కత్తితో దాడి

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు మద్యం దుకాణం వద్ద సోమవారం రాత్రి ఓ యువకునిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసి హత్యకు యత్నించారు. ఈ సంఘటనపై ఎస్.రాయవరం ఎస్‌ఐ ప్రసాద్‌రావు అందించిన వివరాలిలా ఉన్నాయి. కొరుప్రోలు గ్రామానికి చెందిన దంటు ప్రవీణ్‌కుమార్ మద్యం దుకాణం సమీపంలో బైకుపై వస్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై కత్తితో దాడి చేసి పరారయ్యారు. గాయపడిన ప్రవీణ్ కుమార్‌ను సమీపంలో ఉన్న వారు 108 వాహనంలో నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించినట్టు చెప్పారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

పన్ను బకాయిదార్లపై కొరడా

- వాహన యజమానులకు మెసేజ్‌లు, నోటీసులు
- చెల్లించనివారిపై కేసు నమోదు.. రెట్టింపు ఫైన్
- ఎంవీ ఇన్‌స్పెక్టర్ల ద్వారా స్పెషల్ డ్రైవ్
- పాత వాహనాలు స్క్రాప్ చేసినా రిజిస్ట్రేషన్ రద్దు తప్పనిసరి



ప్రత్యేక డ్రైవ్‌లో వాహనాలను పరిశీలిస్తున్న రవాణాశాఖ అధికారులు

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో పన్ను బకాయిలున్న వాహనాల సంఖ్య అధికమైంది. అలాంటి వాహన యజమానులపై కొరడా ఝుళిపించడానికి రవాణా శాఖ సిద్ధమవుతోంది. పన్నులు చెల్లించకపోతే వాహనదారులపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. బకాయి ఉన్న వాహన యాజమానులకు అవగాహన కల్పించేందుకు రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపడుతోంది. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా బకాయి ఉన్న వాహనాలపై కేసులు నమోదు చేయడంతోపాటు రెట్టింపు జరిమానా కూడా అధికారులు వసూలు చేస్తున్నారు. జనవరిలో 1,123 కేసులు నమోదు చేసి రూ.91 లక్షల బకాయి వసూలు చేశారు.

మొబైల్స్‌కి మెసేజ్, నోటీసులు

జిల్లాలో వాహన పన్ను బకాయిదారుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో తక్షణమే ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని, కేసు నమోదు చేయాల్సి వస్తే రెండు వందల శాతం అపరాధ రుసుం విధించాల్సి వస్తుందని రవాణా శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. బకాయిదారులకు నోటీసులు ఇవ్వడంతోపాటు వారి మొబైల్‌కి మెసేజ్ ద్వారా సమాచారాన్ని అందిస్తున్నారు.

జిల్లాలో పన్ను చెల్లించని వాహనాలు	6,818
ఒక టెర్మ్ కట్టనివారు	1,418
రెండుసార్లు చెల్లించనివారు	499
మూడు టెర్మ్‌ల నుంచి కట్టనివారు	318
అంతకుమించి చెల్లించని వాహనాలు	4,583
ప్రభుత్వానికి రావలసిన బకాయి రూ.	12 కోట్లు

ఏ వాహనానికి ఎంత చెల్లించాలి.. (మూడు నెలలకు)
ట్రాక్టర్ (ఫ్రీ ట్రయిలర్)-రూ.760
(తెల్లబోర్డు ఉన్న ట్రాక్టర్లకు పన్ను ఉచితం. ఎల్లో బోర్డు ఉన్న వాటికి మాత్రమే చెల్లించాలి)
లైట్ గూడ్స్ వెహికల్ (ఎల్‌జీవీ)-రూ.1,050
మీడియం గూడ్స్ వెహికల్ (ఎంజీవీ)-రూ.5,000
ఆర్టిక్యులేటెడ్ వాహనాలు- రూ.10 వేలు
ప్రైవేట్ ట్రావెల్స్, బస్సులు- రూ.40 వేలు

స్క్రాప్ వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేసుకోవాలి...



వాహన పన్నును రవాణా శాఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో చెల్లించుకోవచ్చు. పాత వాహనాలు స్క్రాప్ చేస్తే రవాణా శాఖ వద్ద వాటి రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవాలి. లేదంటే వాటికీ పన్ను కొనసాగుతుంది. పన్ను చెల్లించని వాహనదారులకు మేము ఫోన్ చేసి చెబుతున్నాం. కొంతమంది యజమానులు వాహనాలను నడపడంలేదు.. రెస్ట్‌లో ఉంచామంటున్నారు. అలా రెస్ట్‌లో ఉన్న వాహనాలుంటే రవాణా శాఖ వద్ద రెస్ట్ పీరియడని నమోదు చేసుకోవాలి. ఈ సదుపాయం కూడా ఆన్‌లైన్లో ఉంది. నిర్లక్ష్యంగా ఉంటే చెల్లించాల్సిన పన్ను రెట్టింపవుతుంది. మూడు క్వార్టర్లకు పైగా చెల్లించనివారు 4 వేలమందికి పైగా ఉన్నారు. వారు త్వరితగతిన చెల్లించాలి.

– వీర్రాజు, జిల్లా రవాణాశాఖ అధికారి

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- అధికారులతో కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

తుమ్మపాల: మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు జరగనున్నట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వాహణకు సంబంధించి అధికారులతో సోమవారం తన చాంబర్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 20 నుంచి మార్చి 7 వరకు ప్రథమ, ద్వితీయ సంవత్సర ఒకేషనల్ కోర్సుల ప్రాక్టికల్ పరీక్షలు, 26 నుంచి వచ్చే నెల 7 వరకు ద్వితీయ సంవత్సరం రెగ్యులర్ కోర్సుల ప్రాక్టికల్స్ జరగనున్నట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నారు. ప్రాంతీయ తనిఖీ అధికారి(ఆర్‌ఐవో) ఉమారాణి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 15న నైతిక, మానవ విలువల పరీక్ష, 17న పర్యావరణవిద్యపై పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులు మాత్రమే ప్రధాన పరీక్షలకు అర్హులని తెలిపారు. ఇంటర్మీడియట్ వివిధ కోర్సులకు సంబంధించి జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 10,568, రెండవ సంవత్సరం 13,100 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు వెల్లడించారు. 65 పరీక్షా కేంద్రాలల్లో ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి బి.సుజాత, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ హేమంత్, ఏపీఈపీడీసీఎల్ అధికారి రమణమూర్తి, అదనపు ఎస్పీ సత్యనారాయణరావు, అధికారులు పాల్గొన్నారు.

సాయుధ పోలీసులకు క్రమశిక్షణ అవసరం



శిక్షణ ముగింపు సందర్భంగా మాట్లాడుతున్న అనకాపల్లి ఎస్పీ గౌతమి సాలి

ఆరిలోవ (విశాఖ తూర్పు): సాయుధ పోలీసులకు క్రమశిక్షణ అవసరమని అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి సాలి అన్నారు. విశాలాక్షినగర్ ప్రాంతం కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో వార్షిక మొబలైజేషన్ పేరుతో రెండు వారాలుగా సాయుధ పోలీసులకు అందిస్తున్న శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ శిక్షణ గత నెల 30న ఇక్కడ ప్రారంభమైన విషయం తెలిసిందే. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఏఆర్ పోలీస్ సిబ్బందికి ఇక్కడ శిక్షణ అందించారు. ముగింపు సందర్భంగా పోలీసుల కవాతు ఆకట్టుకొంది. పోలీస్ జాగిలాల విన్యాసాలు అలరించాయి. అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమి సాలి మాట్లాడుతూ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డు సిబ్బంది పోలీస్ శాఖకు వెన్నెముకలాంటివారన్నారు. సాయుధ పోలీసులకు అవరమైన క్రమశిక్షణ ఇక్కడ నేర్పినట్లు తెలిపారు. ఏఆర్ పోలీసులు సివిల్ పోలీసులకు సహకరించడంలో సత్తా చూపుతున్నారన్నారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన సిబ్బందికి బహుమతులు అందజేశారు. అనకాపల్లి అదనపు ఎస్పీ(క్రైం) పి.సత్యనారాయణరావు, అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు ఎస్పీ వి.సత్తిరాజు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రకృతిని గౌరవించాల్సిందే..

- విశాఖ పోర్టు ట్రస్ట్ ఛైర్మన్ రామ్మోహన్‌రావు
- ఆర్కే బీచ్‌లో డ్రెడ్జింగ్ పనులు ప్రారంభం



డ్రెడ్జింగ్ పనులను పరిశీలిస్తున్న పోర్ట్ చైర్మన్ రామ్మోహన్ రావు

బీచ్‌రోడ్డు: ప్రతి ఒక్కరూ ప్రకృతిని గౌరవించాలని.. లేకుంటే అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని విశాఖ పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ రామ్మోహన్‌రావు అన్నారు. రూ.20 కోట్ల వ్యయంతో సోమవారం ఆర్కేబీచ్‌లో డ్రెడ్జింగ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీరాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో ఏటా డ్రెడ్జింగ్ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. సముద్రంలో పూడికను బయటకి తీయడం చాలా ఖర్చుతో పాటు సమయం పడుతుందన్నారు. విశాఖ పోర్టు సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఏటా రూ.20 కోట్లతో ఈ డ్రెడ్జింగ్ పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. నెల రోజుల పాటు సాగే ఈ డ్రెడ్జింగ్ పనుల్లో రెండు లక్షల క్యూబిక్ టన్నుల ఇసుకను బయటకు తీయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సముద్రం అలల తాకిడికి బీచ్ కోతకు గురవుతుందని, అందమైన విశాఖను పరిరక్షించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే మిగిలిన ప్రాంతాల్లో కూడా డ్రెడ్జింగ్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎండీ దివాకర్, డీసీఐ సీహెచ్‌వోడీ చౌదరి, అశ్విని తదితరులు పాల్గొన్నారు..

హెచ్‌పీసీఎల్ చిమ్నీ నుంచి ఎగసిన మంటలు

- భయం లేదన్న అధికారులు



చిమ్నీ నుంచి ఎగిసిపడుతున్న మంట

మల్కాపురం (విశాఖ పశ్చిమ) : హెచ్‌పీసీఎల్ చిమ్నీ నుంచి సోమవారం నల్లటి పొగ కమ్ముకుంది. ఆపై మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఈ ప్రాంతీయులు ఆందోళనకు గురయ్యారు. సంస్థలో డీహెచ్‌డీఎస్ యూనిట్‌లో మరమ్మతులు జరుగుతున్నాయి. ఈ యూనిట్ పైపులైన్‌లో ఉండే క్రూడ్ వ్యర్థాలు చిమ్నీ ద్వారా నల్లటి పొగతో కూడిన మంట ఒక్కసారిగా ఎగసి పడింది. దీంతో జనం మరింత కలవరం చెందారు. అప్పుడప్పుడు చిమ్నీ నుంచి ఇలా పొగతో కూడిన మంట వస్తుందని ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సంస్థ యాజమాన్యం పేర్కొంది.

సరికొత్త చదువులు!

- వృత్తి విద్య వైపు అడుగులు
- పాఠశాల స్థాయిలోనే అమలు
- ఉమ్మడి విశాఖలో 11 స్కూళ్ల ఎంపిక



వృత్తి విద్యకు ఎంపికైన గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో సరికొత్త చదువుల వైపు అడుగులు ముందుకు పడుతున్నాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా పాఠశాల స్థాయిలోనే వృత్తి విద్యా బోధన చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్ కుమార్ అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. 6 నుంచి 8వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వృత్తి విద్య బోధన అమలు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 130 పాఠశాలలను ఎంపిక చేయగా, ఇందులో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 11 పాఠశాలలు ఉన్నాయి.

ఇదీ లక్ష్యం..

పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల్లో చాలా మంది వృత్తి విద్య కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉపాధి గ్యారెంటీ కోర్సులు కావడంతో వీటికి మంచి క్రేజ్ ఉంది. ఇలాంటి కోర్సుల్లో చేరే విద్యార్థులను ముందస్తుగా సన్నద్ధం చేసే క్రమంలో పాఠశాల స్థాయిలో వృత్తి విద్య బోధన అమలుకు నిర్ణయించారు. పని అనుభవం, ఉత్పాదకత పెంచే దిశగా కార్యకలాపాలు విద్యార్థులకు అలవాటు చేయడం, వివిధ రకాల వస్తువుల తయారీకి అవసరమైన పరికరాలు, యంత్రాలను గుర్తించడం, వాటిని ఎలా ఉపయోగించాలనేది విద్యార్థులకు నేర్పుతారు. చేతి పనులు చేయటంలో ప్రాథమిక నైపుణ్యాలు పెంపొందించటం, విద్యార్థుల్లో పరస్పర సహకారం, బృంద పనులు అలవాటు చేస్తారు.

చేతి వృత్తులకు ప్రోత్సాహం

సైన్సు, గణితం సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు పాఠశాల స్థాయిలో వృత్తి విద్య అమలుపై తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తారు. పాఠశాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు, ప్రధానంగా చేతి వృత్తుల కేంద్రాల సందర్శనకు విద్యార్థులను తీసుకెళ్తారు. చేతి వృత్తుల పరిశ్రమల నిర్వహణదారులతో ముఖాముఖి ఏర్పాటు చేస్తారు. గ్రామ, పట్టణ ప్రాంతాల్లో చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు ఇది దోహదపడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు.

ఎంపిక చేసిన పాఠశాలలు ఇవే..

విశాఖలో గోపాలపట్నం బాలురు, బాలికల జెడ్పీ హైస్కూళ్లు, నడుపూరు, చింతల అగ్రహారం ఉన్నత పాఠశాలలు, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని వడ్డాది, వేములపూడి, నక్కపల్లి జెడ్పీ హైస్కూళ్లు, తానాం బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కశింకోట జెడ్పీ హైస్కూల్ (బాలికలు), అరకువేలీ గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూల్, మారేడుమిల్లి గిరిజన సంక్షేమ పాఠశాలను వృత్తి విద్యా కోర్సులకు ఎంపిక చేశారు.

వృత్తి విద్యకు మంచి రోజులు



వృత్తి విద్యకు మంచి రోజులు వచ్చాయి. ఒకేషనల్ కోర్సులు చేసే విద్యార్థులకు సత్వరమే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కుతున్నాయి. పాఠశాల స్థాయిలో వృత్తి విద్య బోధనకు ఏర్పాట్లు చేయడం వల్ల, విద్యార్థుల్లో మరింత ఆసక్తి పెరుగుతుంది.

– ఆర్.సత్యనారాయణ, డీవీఈవో, విశాఖ జిల్లా

బోధనకు ఏర్పాట్లు చేస్తున్నాం



పాఠశాల స్థాయిలో వృత్తి విద్య బోధన చేపట్టాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో దీనిని అమలు చేసేందుకు దృష్టి సారించాం. వృత్తి విద్య బోధన వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. దీనిని పటిష్టంగా అమలు చేసేలా ప్రధానోపాధ్యాయులను అప్రమత్తం చేస్తాం.

– ఎల్.చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

ఒకే ఒక లోకం నువ్వే.. లోకంలోన అందం నువ్వే..



కులము.. గిలము.. బలము చూసి..
వయసు.. వరస.. సొగసూ చూసి..
పుట్టుకొస్తాదా ప్రేమ..?
మనసుకు మనసుకు వంతెనేసి..
తనువూ.. తనువు మెలికలేసే తీరేరా ప్రేమ..
కవి చెప్పినట్లుగానే... ఆకాశమంతా.. ఆనందమై.. తెల్లారుతోంది ప్రేమికుల కోసమే.. ఆలోచనంతా ఆరాటమై.. అన్వేషిస్తోంది ఈరోజు కోసమేనంటున్నారు వైజాగ్ ప్రేమికులు.

– సాక్షి, విశాఖపట్నం

- వలపు సంబరాలు చేసుకుంటున్న జంట హృదయాలు
- ప్రేమికుల రోజున విశాఖలో వ్యాపార సంబరం
- వాలంటైన్స్‌డే గిఫ్టుల అమ్మకాల విలువ రూ.20 కోట్లు దాటే అవకాశం

విశాఖను వాలంటైన్స్ డే ఫీవర్ ఆవరించింది. జంట హృదయాలు వలపు సంబరాలు చేసుకుంటుంటే.. ఆ గుండెకు హత్తుకునేలా బహుమతులిచ్చిపుచ్చుకునే సందడితో వ్యాపారులు కూడా ప్రేమికుల రోజు సంబరాలు చేసుకుంటున్నారు.

లవ్ వైజాగ్‌లో... లవ్ యూ డార్లింగ్..

ప్రేమకు ప్రాంతం లేదు.. కులం లేదు.. మతం లేదు.. భాష లేదు, భావం లేదు. ప్రేమ అందరి హృదయాల్ని కొల్లగొట్టేసింది. విశాఖ యువతరం కూడా ప్రేమ వానలో తడిసి ముద్దైపోతున్నారు. ఎప్పుడెప్పుడా అని ఫిబ్రవరి 14 కోసం ఎదురుచూస్తూ తమకు నచ్చిన వారికి ముచ్చటైన బహుమతులు కొని ఇంప్రెస్ చెయ్యాలని రాత్రంతా అన్వేషిస్తూనే ఉన్నారు. పార్కులు, బీచ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు.. ఇలా అన్ని చోట్లా జంట గువ్వలు గుసగుసలాడుకుంటూనే ఉంటాయి. తొలినాళ్లలో ప్రేమంటే మాటల ద్వారా వ్యక్తపరిచేది. ఆ తర్వాత ప్రేమలేఖలు.. ఆపై రోజా పూలు.. ఆ తర్వాత గ్రీటింగ్ కార్డులు.. ఇలా.. తరం మారుతున్న కొద్దీ లవ్ రిచ్‌గా మారిపోతోంది. అదేమని అడిగితే.. హలో గురూ.. ప్రేమ కోసమే కదా అని జోష్‌తో చెబుతున్నారు ఈ తరం యూత్. మరి ఈ రోజున లవ్ వైజాగ్.. లవర్స్ కోసం ఎంత ఖర్చు చేస్తుంటారో తెలుసా..? అక్షరాలా రూ.20 కోట్ల రూపాయలు. తన కోసం ఎదురు చూసే ప్రేమ గుండెకు ఇచ్చే బహుమతిలోనే కొండంత ప్రేమ కనిపించాలని లవర్స్ ఉవ్విళ్లూరుతుంటారు. అందుకే.. విశాఖ యువత గిఫ్ట్ కోసం బోలెడు ఖర్చు చేస్తున్నారు.



- గతేడాది ప్రేమికుల రోజున నగరంలో రూ.15 కోట్ల వరకూ బహుమతులు కొన్నారని అంచనా.
- ఈ ఏడాది సుమారు రూ.20 కోట్ల వరకూ అమ్మకాలు పెరుగుతాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే వాలంటైన్ వీక్ పేరుతో దాదాపు రూ.10 కోట్ల అమ్మకాలు జరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.
- ప్రేమికుల రోజున మన నగరంలో రూ.2 కోట్ల రూపాయల గులాబీ పూలు అమ్ముడవుతాయని పూల వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా రెడ్, పింక్ గులాబీలే ఎక్కువగా అమ్ముడవుతాయంట.
- వ్యాపారులు గిఫ్టులకు 20 నుంచి 50 శాతం వరకూ డిస్కౌంట్ ఆఫర్లిచ్చి ఆకర్షిస్తున్నారు.
- రెస్టారెంట్స్, హోటల్స్ వాలంటైన్స్ కోసం స్పెషల్ టేబుల్స్ రిజర్వ్ చేశాయి. బీచ్‌రోడ్డులోని కొన్ని హోటల్స్.. ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి.
- ఫిబ్రవరి 14 కోసం మల్టీప్లెక్స్‌లలో అడ్వాన్స్ బుకింగ్ టికెట్లు అమ్మకాలు జరగ్గా అందులో కపుల్ టికెట్స్ దాదాపు 50 శాతం ఉండటం విశేషం.
- జ్యుయలరీ షాపులు డిస్కౌంట్ అందిస్తున్నాయి.
- భీమిలి సమీపంలోని ఓ హోటల్‌లో 50 టేబుల్స్ లవ్ స్పాట్‌లుగా అడ్వాన్స్ బుకింగ్ పెట్టినట్లు ప్రకటించిన 24 గంటల్లోనే అన్నీ బుక్ అయ్యాయంట.

సోషల్ మీడియాలో లవ్ వాన

విశ్వజనీయమైన ప్రేమ.. సోషల్ మీడియానూ లవ్ వానలో ముంచెత్తేలా చేస్తోంది. వారం రోజుల క్రితం మొదలైన ప్రేమికుల వారోత్సవాలప్పుడు ప్రారంభమైన లవ్ పోస్టులు.. చక్కర్లు కొడుతూనే ఉన్నాయి. హార్ట్‌బీట్ సింబల్స్, కవితలు, గ్రీటింగ్ కార్డులు, ప్రేమ చిహ్నాలు, గిఫ్టులు.. ఇలా ఎన్నో రకాలైన సింబల్స్, స్టిక్కర్లు, ఫోటోలు, కొటేషన్లతో ఫేస్‌బుక్, వాట్సప్, ట్విట్టర్, టెలిగ్రామ్, మెసెంజర్.. ఇలా.. అన్నీ బిజీ బిజీగా మారిపోయాయి.



పెళ్లికి కాస్తా ఆలోచిస్తున్నాం

నిండా లవ్‌లో మునిగిన వారికి కూడా ఈ ప్రేమ నిర్వచనం సంగతి ఓ పట్టాన అంతుచిక్కదు. అందుకే ప్రేమకు అర్థం వెతికేందుకు నగరంలో దాదాపు 100 మంది యువతీ యువకులతో మాట్లాడగా.. చాలా మంది యువత కొత్త కొత్త అర్థాలు చెప్పారు. ఈ సమాధానాల్లోనే.. చాలా మంది వీర ప్రేమికులు, భగ్న ప్రేమికులు, టైంపాస్ బతానీలు, వన్‌సైడ్ లవర్స్ కనిపించారు. ఆ సమాధానాల సంగతేంటో మీరు చదవండి...

- ప్రేమంటే రెండు జీవితాలు, రెండు హృదయాలు, రెండు కుటుంబాలు : 35 మంది
- పెళ్లి చేసుకోడానికి వేసే మొదటి అడుగు : 15 మంది.
- కాలేజీలో ఒంటరి జీవితానికి తుంటరి తోడు : 10 మంది
- జీవితం బోర్ కొట్టకుండా టైంపాస్ చేసుకునేది : 25 మంది
- ప్రేమంటే సెక్స్ : 4
- వన్‌సైడ్ లవర్‌ని, నాకు అంతు చిక్కడంలేదు: 11 మంది.

ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు డిపాజిట్ల గల్లంతు


మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు

కోటవురట్ల: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు డిపాజిట్లూ దక్కవని మాజీ ఎమ్మెల్సీ, విశాఖ తూర్పు నియోజకవర్గం వైఎస్సార్‌ సీపీ పరిశీలకుడు డీవీ సూర్యనారాయణరాజు జోస్యం చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి వైఎస్సార్‌ సీపీ అభ్యర్థిగా రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్‌ చైర్మన్‌ సీతంరాజు సుధాకర్‌ను ప్రకటించారన్నారు. సుధాకర్‌ అత్యధిక మెజార్టీతో గెలవడం తథ్యమన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌ సీపీకి అత్యంత ప్రజాదరణ ఉందని, సంక్షేమ పథకాలే పార్టీకి అండగా ఉంటాయన్నారు. దేశంలో ఏ ప్రభుత్వమూ ఈ విధంగా సంక్షేమం అమలు చేయడం లేదన్నారు.

ప్రతి అర్జీపై క్షేత్రస్థాయిలో విచారణ

- అధికారులకు కలెక్టర్‌ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం
- కలెక్టరేట్‌ స్పందనకు 178 అర్జీలు

తుమ్మపాల: స్పందనలో వచ్చే ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, స్పష్టమైన సమాధానం అర్జీదారుడికి అందించాలని కలెక్టర్‌ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయనతోపాటు జేసీ కల్పనాకుమారి అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారుడికి నమ్మకం కలిగించే విధంగా విచారణ చేపట్టాలన్నారు. మొత్తం 178 వినతులు నమోదయ్యాయి. కలెక్టరేట్‌ ఆవరణలో డీఆర్వో వెంకటరమణ దివ్యాంగుల వద్దకు వచ్చి వారి సమస్యలను తెలుసుకున్నారు.

కలెక్టరేట్‌లో ప్రైవేటు వ్యక్తులకు చెక్‌..

సమస్యలపై స్పందనకు వచ్చిన ప్రజల అర్జీలు రాసేందుకు కలెక్టరేట్‌ వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు అక్కడ తిష్ట వేసి అర్జీలు రాసేందుకు నగదు వసూలు చేస్తున్నారు. ఈ అంశమై ఉన్నతాధికారులు స్పందించి నిరక్షరాసులు, దివ్యాంగులు, వృద్ధుల సమస్యలను విని రాసేందుకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌ ప్రాంగణంలో టెంట్‌ ఏర్పాటు చేసి అర్జీలు రాసిపెడుతున్నట్లు స్పందన ఇన్‌చార్జి సత్యనారాయణ తెలిపారు. ప్రైవేటు వ్యక్తులు ఇక్కడ అర్జీలు రాసేందుకు నగదు వసూలు చేస్తే బైండోవర్‌ చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

క్వారీ అనుమతులు రద్దు చేయాలని నిరసన

రావికమతం మండలం మరుపాక సర్వే నంబరు 258లో బీఎంజే క్వారీ అనుమతులు రద్దు చేయాలని గదబపాలెం, పెదగొట్టిపాలెం, మరుపాక గ్రామ గిరిజనులు కలెక్టర్‌కు విన్నవించారు. ఇటీవల పంచాయతీలో చేపట్టిన గ్రామసభలో ప్రైవేటు వ్యక్తులతో సంతకాలు చేయించారని వాపోయారు. అనంతరం కలెక్టరేట్‌ గేటు వద్ద నిరసన చేపట్టారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు....

అనకాపల్లి మండలం రేబాక గ్రామ సర్వే నంబరు 99లో కొండను తవ్వి 25 ప్లాట్లతో ప్రైవేటు లేఅవుట్‌ వేసిన ఆక్రమణదారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కరణం నాయుడు, జాజుల ప్రసాద్‌, మంత్రి కాసులునాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో శంకరం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఎకరా విస్తీర్ణంలో కొండను ఆక్రమించి గ్రావెల్‌ తవ్వి విక్రయించారని, ఇప్పుడు అనధికార లేఅవుట్‌ వేశారన్నారు. దీన్ని స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్‌ రవి పట్టాన్‌శెట్టి, జేసీ కల్పనాకుమారి


అర్జీలు రాస్తున్న ప్రభుత్వ సిబ్బంది

రైత్వారీ పట్టా మంజూరు చేయాలని వినతి

వారసత్వంగా వస్తున్న బారిక నౌకరీ భూమికి రైత్వారీ పట్టా మంజూరు చేయాలని పరవాడ మండలం పెదముసిడివాడకు చెందిన దివ్యాంగుడు రావాడ అప్పారావు స్పందనలో విన్నవించాడు. సర్వే నెం.96-2లో 87 సెంట్ల భూమికి నేటికి రైత్వారీ పట్టా మంజూరు చేయలేదని వాపోయాడు. డాక్టర్‌ బీఆర్‌.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్‌. వరప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా దళిత సంఘాల ఐక్య వేదిక సభ్యులు కలెక్టరేట్‌ వద్ద నిరసన వ్యక్తం చేశారు. సోషల్‌ మీడియా ద్వారా భయంకరమైన ప్రచారం చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన నాగులారపు వరప్రసాద్‌ అలియాస్‌ హమారా ప్రసాద్‌పై కలెక్టర్‌, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు.


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిసాలి


నిరసన చేస్తున్న గిరిజనులు

ఎస్పీ స్పందనకు 43 అర్జీలు

అనకాపల్లి టౌన్‌: ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 43 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ గౌతమిసాలి మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్‌ వంటి సమస్యలపై అర్జీలు అందినట్లు తెలిపారు. చట్ట పరిధిలో అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆయా పోలీస్‌ స్టేషన్లలో దిగువ స్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

సినీ నటి సుజాత సింహాద్రికి సత్కారం


అమ్మవారిని దర్శించుకుంటున్న సినీ నటి సుజాత సింహాద్రి

మునగపాక: పలు సినిమాల్లో నటించిన సుజాత సింహాద్రిని మండలంలోని వాడ్రాపల్లి గ్రామస్తులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్రలో పేరుగాంచిన పారిపల్లెమ్మ అమ్మవారిని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గల్లీరౌడీ, చెక్‌పోస్టు, గాలి సంపత్‌, జగన్నాటకం తదితర 25 చిత్రాల్లో సుజాత సింహాద్రి నటించారు. సర్పంచ్‌ కాండ్రేగుల నూకరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్‌ కన్నంనాయుడు, గ్రామ పెద్దలు పెతకంశెట్టి రామజోగినాయుడు, కొయిలాడ దశావతారం, మల్ల వరహా నరసింగరావు, పెతకంశెట్టి లీలా భాస్కర్‌, భాస్కరరావు, పారునాయుడు పాల్గొన్నారు.

16 మందిపై ప్రభుత్వ భూ ఆక్రమణ కేసు


ప్రభుత్వభూమిని పరిశీలిస్తున్న ఆర్‌ఐ రమేష్‌

అనకాపల్లిటౌన్‌ : ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన 16 మందిపై రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసినట్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ రమేష్‌ తెలిపారు. అజ్ఞాత వ్యక్తులిచ్చిన సమాచారం మేరకు అనకాపల్లి మండలం మారేడుపూడి గ్రామం సర్వే నెం.357లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మిస్తున్న షెడ్లను తొలగించినట్టు పేర్కొన్నారు. తహసీల్దార్‌ గంగాధరరావు ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు.

పసిడి కలశాలతో ఘనంగా సారె ఊరేగింపు


పెద్ద ఎత్తున మాలధారణ భక్తుల ప్రదర్శన

- రేపు గర్నికం బాలచెంచమ్మతల్లి అమ్మవారి తీర్థం

రావికమతం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గర్నికం బాలచెంచమ్మతల్లి తీర్థం బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులతోపాటు ఇతర గ్రామాలకు చెందిన వంద మందికి పైగా భక్తులు అమ్మవారి మాలధారణ చేసి నిత్యం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం గ్రామంలో పసిడి కలశాలతో సారెను ఊరేగించారు. ఈ సందర్భంగా రావికమతం నుంచి ఆ గ్రామం వరకూ భారీ విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. బాలచెంచమ్మతల్లిని తలచుకుని ఏ కార్యమూ చేసినా ఫలిస్తుందని గ్రామస్తుల నమ్మకం. ఈ విశ్వాసంతోనే ఏటా నిర్వహించే అమ్మవారి తీర్థానికి జిల్లా నుంచే గాక పలు జిల్లాల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

ఇంటికో టన్ను చెరకు...

అమ్మవారి ఆలయానికి భూములు, మాన్యాలు లేవు. గ్రామ రైతులంతా ఏటా అమ్మవారి పేరున చోడవరం సుగర్‌ ఫ్యాక్టరీకి టన్ను చెరకు చొప్పున కేటాయిస్తుంటారు. ఈ ఆదాయంతోపాటు హుండీ కానుకలతో తీర్థాన్ని ఘనంగా నిర్వహిస్తారు.

జీపు బోల్తా పడి మహిళ మృతి


మార్చురీలో ఉన్న సుంక్రి మృతదేహం

అరకులోయ రూరల్‌ : మాడగడ పంచాయతీ కుసుమగూడ గ్రామానికి చెందిన వంతల సుంక్రి అనే మహిళ కుటుంబ సమేతంగా డుంబ్రిగుడ మండలం ముగ్రిగూడ వివాహ వేడుకకు జీపులో వెళ్తుండగా బల్లిగెడ్డ మలుపు వద్ద జీపు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వంతల సుంక్రి (40) అక్కడికక్కడే మృతి చెందగా, మృతదేహాన్ని అరకులోయ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కిల్లో అభిషేక్‌(20)ను విశాఖ కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌ తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

నాతవరం : మండలంలో రెండు చోట్ల అమ్మవారి ఆలయాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది, తాండవ రిజర్వాయరు గట్టు దిగువనున్న శ్రీనల్లకొండమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఆలయంలోకి చొరబడి హుండీలను పగులగొట్టి నగదును పట్టుకుపోయారు. ఇక్కడ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాకు వైర్లు కట్‌ చేసి ఆలయంలోకి చొరబడ్డారు. ఆలయ హుండీలో రూ.20వేలకు పైగా నగదు ఉంటుందని ఆలయ కమిటీ నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. గన్నవరం గ్రామంలో గల శ్రీనూకాలమ్మతల్లి ఆలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం తలుపులు పగులగొట్టి లోపలకు ప్రవేశించి అమ్మవారి మెడలో ఉన్న బంగారు శతమానాలు చోరీ చేశారు. ఆలయంలో హుండీలను సమీపంలో ఉన్న పంట పొలాల్లోకి ఎత్తుకుపోయి అక్కడ హుండీలను పగులగొట్టి నగదును పట్టుకుపోయారు. ఇటీవల నూకాలమ్మ తల్లి ఆలయాన్ని కొత్తగా నిర్మించడంతో అధిక సంఖ్యలో భక్తులు వస్తున్నారన్నారు. శతమానాలతో పాటు హుండీలో నగదు రూ.25వేలకు పైగా ఉండవచ్చునని మండల వైస్‌ ఎంపీపీ పైల సునీల్‌ తెలిపారు. ఈ రెండు ఆలయాల్లో జరిగిన చోరీలపై ఆలయ కమిటీ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొబ్బరి పీచు పరిశ్రమలో అగ్ని ప్రమాదం


కాలిబూడిదవుతున్న కొబ్బరి పీచు

ఎస్‌.రాయవరం: కొరుప్రోలు కొబ్బరి పీచు పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించి భారీ ఆస్తి నష్టం సంభవించింది. గ్రామం శివారులో ఉన్న రాయిడు క్వాయిర్‌ ఇండస్ట్రీలో విద్యుత్‌ వైర్ల నుంచి నిప్పులు రాలి పరిశ్రమలో ఆరబెట్టిన పీచుపై పడి మంటలు చెలరేగాయని పరిశ్రమ యజమాని బిక్కిన శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ మంటలు అదుపు చేసేలోగా పక్కన ఉన్న మరో పరిశ్రమ పద్మావతి క్వాయిర్‌ ఇండస్ట్రీలో ఉన్న పీచుకు నిప్పు అంటుకుందని చెప్పారు. ఈ రెండు పరిశ్రమల్లో సుమారు రూ.20 లక్షల విలువ చేసే పీచు, పొట్టు , బైయిల్స్‌ కాలిబూడిదయ్యాయని చెప్పారు. నక్కపల్లి, యలమంచిలి అగ్ని మాపక కేంద్రాల నుంచి ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపు చేశాయి. ప్రమాద వివరాలు తెలుసుకున్న రెవెన్యూ అధికారులు నష్టం అంచనాలు వివరాలు నమోదు చేస్తున్నట్టు చెప్పారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

యలమంచిలి : యువతి అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలివి. యలమంచిలి పాతవీధికి చెందిన తాడి ఝాన్సీరాణి(20) ఈ నెల 10వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీనిపై ఝాన్సీ తండ్రి తాడి శివ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఇన్‌చార్జి డీఎస్పీగా మళ్ల మహేష్‌

అనకాపల్లి టౌన్‌: ఇన్‌చార్జి డీఎస్పీగా మళ్ల మహేష్‌ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం దిశ డీఎస్పీగా పనిచేస్తున్నారు. డీఎస్పీ సునీల్‌ సెలవుపై వెళ్లడంతో మహేష్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

నేడు సెంట్రల్‌ టీమ్‌ పర్యటన

ముంచంగిపుట్టు: మండలంలోని పెదగూడ పంచాయతీ గలగండ,జర్రిపడా గ్రామాల్లో ఢిల్లీ నుంచి వచ్చే సెంట్రల్‌ టీమ్‌ మంగళవారం పర్యటించనున్నట్టు వెలుగు ఏపీఎం దేవమంగ తెలిపారు. రెండు గ్రామాల్లో పీవీటీజీ గిరిజనుల భాషా, సంస్కృతి,ఆచార వ్యవహారాలు, స్థితిగతులు,అమలవుతున్న సంక్షేమ పథకాలుపై అధ్యయనం చేయనుందని ఆమె తెలిపారు.

కల్లులో బుగ్గి పిక్కలు కలపడం వల్లే ఒకరి మృతి

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు


పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడు

గూడెంకొత్తవీధి/చింతపల్లి : గూడెంకొత్తవీధి మండలం ఆకులూరులో ఈ నెల 6న జీలుగు కల్లుతాగి ఒకరు మృతి చెందిన సంఘటనలో ఒకరిని అరెస్ట్‌ చేశామని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌ శివకిశోర్‌ తెలిపారు. సోమవారం ఆకులూరుకు చెందిన త్రినాథ్‌రావును జీకేవీధి పోలీసులు అరెస్ట్‌ చేశారు. వివరాలివి. ఆకులూరుకు చెందిన మఠం సహదేవ్‌, త్రినాథ్‌రావు వరుసకు అన్నా తమ్ముళ్లు. సహదేవ్‌ జీలుగు కల్లు వ్యాపారం చేస్తూ ఆర్థికంగా స్థిరపడుతున్నాడు. దీంతో త్రినాథ్‌రావులో అక్కసు పెరిగింది. కల్లు చెట్లలో తనకు వాటా కావాలని అడిగాడు. అందుకు సహదేవ్‌ నిరాకరించాడు. దీంతో గత నెల 6న త్రినాథరావు సహదేవ్‌కు చెందిన కల్లు చెట్టులో ప్రమాదకర బుగ్గి పిక్కలు కలిపాడు. కల్లును ఆకులూరుకు చెందిన రామదాసు కుటుంబ సభ్యులు 10 లీటర్లు కొనుక్కుని తాగారు. వీరిలో ఎక్కువగా తాగిన రామదాసు చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా మిగతా ముగ్గురు వ్యక్తులు కోలుకున్నారు. మృతుడి భార్య సుమిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా త్రినాథరావు కల్లులో బుగ్గి పిక్కలు కలిపినట్టు వెల్లడైంది. దీంతో నిందితుడిని అరెస్ట్‌ చేసినట్టు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో జీకేవీధి సీఐ అశోక్‌కుమార్‌, సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

బస్సు దిగుతూ చక్రం కింద పడి...

- ప్రయాణికుడి మృతి
- లుభుర్తి జంక్షన్‌ వద్ద ప్రమాదం


సన్యాసిరావు మృతదేహం

కొయ్యూరు : చింతలపూడి పంచాయతీ లుభుర్తికి చెందిన తూటే సన్యాసిరావు(53) బస్సు నుంచి దిగుతూ ప్రమాదవశాత్తూ వెనక చక్రం కింద పడి మరణించాడు. ఎస్‌ఐ రాజారావు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం సన్యాసిరావు ఆదివారం గూడెంలో ఇంటర్మీడియట్‌ చదువుతున్న కూతురును చూసేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అతని స్వగ్రామం లుభుర్తి వెళ్లేందుకు జంక్షన్‌ వద్ద ఆదివారం రాత్రి బస్సు దిగేందుకు యత్నించారు. అయితే అతను బస్సు దిగుతున్న సమయంలో డ్రైవర్‌ బస్సును లాగించడంతో సన్యాసిరావు బస్సు వెనకచక్రం కింద పడిపోయారు. దీంతో అక్కడికక్కడే సన్యాసిరావు మరణించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. సన్యాసిరావు మృతితో స్వగ్రామం లుభుర్తిలో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్‌ మృతి


మృతిచెందిన రాంబాబు (ఫైల్‌), ప్రమాదానికి గురైన కారు

అనంతగిరి : అరకు అందాలను తిలకించేందుకు వచ్చి కారు బోల్తా కొట్టిన ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్‌ మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. అనంతగిరి పోలీసులు అందించిన వివరాలివి. విశాఖపట్నం సాగర్‌నగర్‌ చెందిన ఎ.రాంబాబు (51) నర్సీపట్నం టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లోని హెడ్‌కానిస్టేబుల్‌ విధులు నిర్వహిస్తున్నారు. అరకు అందాలను తిలకించేందుకు ఆదివారం మరో ఇద్దరితో కలిసి కారులో వచ్చారు. అందాలను తిలకించి, సోమవారం వేకువజామున 3 గంటల సమయంలో మైదానప్రాంతానికి తిరిగి వెళుతుండగా, అనంతగిరి మండలం కొదంగుడ గ్రామ సమీపంలోగల మలుపువద్ద కారు అదుపుతప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు తలకు గాయం కావడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్‌కోట ఏరియా ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

డైట్‌ టెండర్ల పరిశీలన


డైట్‌ టెండర్లను పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్‌

మహారాణిపేట (విశాఖ దక్షిణ): కేజీహెచ్‌లో రోగులకు, డాక్టర్లకు ప్రతిరోజు డైట్‌ సరఫరా చేసేందుకు టెండర్లను పిలిచారు. జేసీ కేఎస్‌ విశ్వనాథన్‌ సమక్షములో టెండర్లను బిడ్డర్ల ముందు తెరచారు. డీడీఎంసీ (డిస్ట్రిక్ట్‌ డైట్‌ మేనేజ్‌మెంటు కమిటీ) చైర్మెన్‌గా జేసీ విశ్వనాథన్‌, కన్వీనర్‌గా సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పి.అశోక్‌కుమార్‌, చిన్న పిల్లల వైద్యులు, జనరల్‌ ఫిజీషియన్‌, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్‌ పి.జగదీశ్వరరావు, డైటీషియన్‌ సభ్యులుగా వున్న కమిటీ ఆధ్వర్యంలో ఈ నిర్వహణ జరిగింది. 11 మంది దరకాస్తు చేసుకోగా 9 మాత్రమే టెండర్లలో పాల్గొన్నారు. అన్ని అంశాలు పరిశీలించిన తరువాత బిడ్డర్లను ఎంపిక చేస్తామని సూపరింటెండెంట్‌ డాక్టర్‌ అశోక్‌ కుమార్‌ తెలిపారు.

క్లుప్తంగా

ధర పెరిగిన టమాటా

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం టమాటా ధర పెరిగింది. గత వారం కంటే కిలోకి రూ.10 ఎక్కువగా పెరిగింది. గత వారం కిలో రూ.20 ఉండగా, ఈ వారం కిలో రూ.30కి అమ్మకాలు జరిగాయి. ఉల్లి రూ.20, బంగాళాదుంప, వంకాయ రూ.30, చిక్కుడు, దొండకాయ రూ.40, బీరకాయ, బీట్‌రూట్, క్యారెట్ రూ.60, క్యాప్సికం, బెండకాయ రూ.80కి విక్రయాలు సాగాయి.

శతశాతం ఉత్తీర్ణతకు కృషి



మామిడిపాలెం హైస్కూల్లో విద్యార్థులతో ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి

అనకాపల్లిటౌన్ : ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ట్రైనీ కలెక్టర్ ధాత్రీరెడ్డి అన్నారు. మండలంలోని కొండకొప్పాక, మామిడిపాలెం గ్రామాల్లోని జిల్లా పరిషత్ హైస్కూళ్లను సోమవారం ఆమె సందర్శించారు. పరీక్షలకు 50 రోజులే సమయం ఉన్నందున ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షల పట్ల భయాన్ని వీడాలని విద్యార్థుల్లో మనోధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో ఎంఈవో దివాకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో పోతురాజుబాబు ఉత్సవం

కశింకోట : మండలంలోని తీడ గ్రామంలో కల్యాణం పోతురాజుబాబు ఉత్సవాలు ఈ నెల 18 నుంచి రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు సర్పంచ్ చిరికి సత్యనారాయణ సోమవారం తెలిపారు. మొదటి రోజు రాత్రి ఆలయం వద్ద జాగరణ ఉత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కోలాటాలు, బాలనాగమ్మ బుర్రకథ ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 19న ప్రధాన ఉత్సవం సందర్భంగా మధ్యాహ్నం గుర్రపు పరుగు పందెం పోటీలను ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. విజేత గుర్రాల నిర్వాహకులకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. రాత్రి భారీ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 13,715 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,500	4,140
మొదటి రకం	3,220	3,700
రెండో రకం	3,050	3,480
మూడో రకం	2,940	3,080

అనకాపల్లి సినిమాలు

పాప్‌కార్న్	- రాజా
వేద	-సత్యనారాయణ స్క్రీన్-1
అమిగోస్	-సత్యనారాయణ స్క్రీన్-2
18 పేజెస్	-షిర్డిసాయి
పఠాన్	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
చడ్డీగ్యాంగ్ (ఉదయం, మధ్యాహ్నం)	- శ్రీసత్య
వారసుడు (ఫస్ట్ షో, సెకండ్ షో)	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 110 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు , బీ పాజిటివ్-55 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-43 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 429 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

రబీ సాగులో వరి జోరు

- చెరకు సాగు నుంచి వరి సాగు వైపు రైతు చూపు
- నీటి లభ్యత, మార్కెట్ పరిస్థితులే కారణం



తెగులు సోకడంతో ఎదుగుదల లేని చెరకు



జోగారావుపేటలో రబీ వరి నాట్లు

కశింకోట : మండలంలోని పలు గ్రామాల్లో రైతులు రబీ సాగులో వరి పంట పట్ల ఈసారి ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. చెరకు సాగు వల్ల ఆశించిన ఆదాయం రాకపోవడంతో వరి సాగుపైనే దృష్టిసారించారు. ఇప్పటికే పలు గ్రామాల్లో రబీ వరి నాట్లు వేశారు. మండలంలో ఖరీఫ్ సీజన్లో వరి, చెరకు పంటలకు ఎక్కువగా సాగు చేస్తుంటారు. రబీ సీజన్లో వరి సాగు నామమాత్రంగానే ఉంటుంది. అయితే ఈ ఏడాది రబీలో సైతం వరి సాగు పట్ల రైతులు దృష్టి సారించారు. చెరకు సాగు ఆశాజనకంగా లేకపోవడం, ప్రస్తుతం రబీ వరి సాగుకు పరిస్థితులు అనుకూలిస్తుండటంతో పలు గ్రామాల్లో నాట్లు వేశారు.

చెరకును ముంచిన తెగుళ్లు

నీటి సదుపాయం బాగా ఉన్న చోట ఖరీఫ్‌తో పాటు రబీలో కూడా వరి పంటే వేయడానికి నిర్ణయించుకున్నారు. చెరకు ఎదుగుదల లేకపోవడం, ఎర్రకుళ్లు, పసుపాకు వంటి తెగుళ్లు ఆశించడం తదితర కారణాల వల్ల చెరకు దిగుబడి తగ్గిపోతున్న పరిస్థితి. దీంతోపాటు బెల్లం తయారు చేసి మార్కెట్‌కు తరలిస్తే ఆశించిన ధర లభించక, పెట్టిన పెట్టుబడి రాక నష్టపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కొందరు రైతులు వరి సాగు వైపు మళ్లినట్లు చెబుతున్నారు. ఇక మీదట ఏటా రెండు పంటలుగా వరినే సాగు చేయాలని భావిస్తున్నారు. దీంతో ఇప్పటికే సొంత బోర్లు, చెరువులతో సాగునీటి సదుపాయం ఉన్న వారు రబీ వరి సాగు చేపట్టారు. ఒక్క జోగారావుపేటలోనే ప్రస్తుతం 23 ఎకరాల్లో వరి సాగు మొదలయింది. మరి కొందరు సాగుకు సమాయత్తమవుతున్నారు. మండలంలో ప్రస్తుతం ఇ-పంట నమోదు జరుగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయితే రబీలో వరి విస్తీర్ణం ఏ మేరకు పెరిగిందో తెలుస్తుందని అధికారులు చెప్తున్నారు.

పుష్కలంగా నీరు

ఈసారి విశేషంగా జోగారావుపేట రైతులు రబీలో వరి సాగు మొదలెట్టారు. ఇక్కడ గత కొన్నేళ్లుగా చాలా వరకు చెరకు పంటపైనే ఆధారపడేవారు. అయితే మార్కెట్ పరిస్థితులు, నల్లబెల్లంపై నిషేధం, తెగుళ్ల బెడద తదితర కారణాలతో చెరకులో ఆశించిన లాభాల్లేక దిగాలు పడుతున్నారు. వరి పంటకు ప్రభుత్వ మద్దతు ధర, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు, మూడు వారాల్లోనే నగదు బ్యాంకు ఖాతాలకు జమ కావడం తదితర కారణాలు కూడా రబీలో వరి సాగు వేపు ఆసక్తి చూపేలా చేసింది. ఖరీఫ్ సీజన్ ముగిసే సమయంలో కురిసిన వర్షాలు కూడా రబీలో వరికి ఊతమిచ్చాయి. చెరువులు, బావులు తదితర జలాశయాలు నీటితో కళకళలాడుతుండటంతో రైతులు ధైర్యంగా వరి సాగు మొదలెట్టారు. ప్రస్తుతం ఇక్కడ రబీ వరి నాట్లు దశలో ఉంది. ఈ గ్రామంతోపాటు కశింకోట, వెదురుపర్తి, పేరంటాలపాలెం, చెరకాం, నూతలగుంటపాలెం తదితర గ్రామాల్లో కూడా నీటి సదుపాయం ఉన్నచోట వరి వేశారు. దీంతో రబీ వరి సాగు మరింత పెరగనుంది. ఈ పంట అనంతరం ఖరీఫ్ వరి వేయనున్నట్లు రైతులు తెలిపారు.

చెరకు నిరాశాజనకం



చెరకు సాగు ఆశాజనకంగా లేదు. మార్కెట్‌లో బెల్లానికి మద్దతు ధర లభించడం లేదు. దీంతో ఆశించిన ఆదాయం రాకపోవడంతో వరి సాగులోకి దిగాం. ప్రస్తుతం రబీ వరి నాట్లు వేశాం. తర్వాత ఖరీఫ్ సీజన్లో కూడా వరి పంటే సాగు చేస్తాం.

– అల్లం వెంకటస్వామి, వరి సాగు రైతు, జోగారావుపేట

డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిపై కేసు

- రూ.37 వేలు జరిమానా విధించిన న్యాయమూర్తి



డివైడర్‌పై గ్రిల్స్ ఏర్పాటును పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను, ఎస్‌ఐ రమేష్



మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్ : మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 13 మందిపై కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరిచినట్టు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను తెలిపారు. న్యాయమూర్తి వీరికి రూ.37 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే వ్యక్తులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అంతకుముందు ట్రాఫిక్ స్టేషన్ ఆవరణలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

డివైడర్లపై గ్రిల్స్ ఏర్పాటు

అనకాపల్లి జాతీయ రహదారిలో మండలంలోని కొప్పాక జంక్షన్ నుంచి తోటాడ జంక్షన్ నూకాంబిక ఆర్చ్ వరకు రోడ్డు మధ్యలో డివైడర్‌పై గ్రిల్స్ ఏర్పాటు చేసినట్టు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను చెప్పారు. డివైడర్ల మీదుగా వెళ్తూ రోడ్డు ప్రమాదాలకు గురవకుండా ఎస్పీ గౌతమిసాలి ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటు చేశామన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు దాటే వ్యక్తులు వాహనాలను పరిశీలించి దాటాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆయా ప్రాంతాల ప్రజలు పోలీసుల, ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బందికి సహకరించాలని కోరారు. మునగపాక మండలంలో తోటాడ జంక్షన్ నుంచి జాతీయ రహదారిపై అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆర్చ్ మీదుగా గవరపాలెం వెళ్లే రూట్లో వాహనదారులు, పాదచారులు ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించి ముందుకు సాగాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ జె.రమేష్, ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్‌కార్డుతో ఆధార్ అనుసంధానం గడువు 18



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్ : నియోజకవర్గంలో చాలా మంది ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం జరగలేదని, ఈ నెల 18లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నికల కమిషన్ దిశానిర్దేశం మేరకు అధికారులంతా ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. చాలా ప్రాంతాల్లో ఓటర్లకు 30 శాతం కూడా నమోదు కాలేదని, ఈ నెల 18వ తేదీలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, కశింకోట ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌నాయుడు, అనకాపల్లి డీటీ శ్రీరామ్మూర్తి, ఎంపీడీవో ధర్మారావు, నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ



ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్ : అనకాపల్లి గవరపాలెంలో ప్రసిద్ధి చెందిన భోగలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 18న మహాశివరాత్రి ఉత్సవాలు భారీగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్ తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా వేకువజాము నుంచి ఆలయంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయ పురోహితులు నారాయణరావు, హరి, చిన్నిల ఆధ్వర్యంలోజరిగే పూజా కార్యక్రమాలను వీక్షించడానికి భక్తులకు సకల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. రాత్రి అఘోర పాశుపత మహా మృత్యుంజయ హోమానికి ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. ఈ హోమం మరుసటి రోజు ఉదయం వరకు జరుగుతుందన్నారు. అలాగే రాత్రి 9 గంటలకు మహన్యాస రుద్రాభిషేకం జరపనున్నట్టు తెలిపారు. ఈ పూజల్లో పాల్గొనేందుకు, వీక్షించేందుకు వీలుగా రోజంతా ఆలయం తెరిచే ఉంటుందన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో 80, 81వ వార్డుల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిలు కొణతాల భాస్కర్, పీలా రాంబాబు, కర్రి శివుడు, కాండ్రేగుల శ్రీరామ్, దాడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాలలో ఫ్లెక్సీల తొలగింపు



ఫ్లెక్సీ తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

అనకాపల్లి రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం చర్యలకు దిగింది. మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో రహదారుల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వివిధ రాజకీయపార్టీల నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది సోమవారం తొలగించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన అన్ని ఫ్లెక్సీలు, బ్యానర్లను నిబంధనల ప్రకారం తొలగించినట్టు పంచాయతీ ఏవో కె.శ్రీనివాస్ తెలిపారు. కోడ్ ముగిసేవరకూ నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేశారు.

నిత్యం యోగాతో ఆరోగ్యం



డైట్ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : నిత్యం యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చని అనకాపల్లి యోగా గురువు ఎం.జగన్ అన్నారు. స్థానిక డైట్ కళాశాల ఆవరణలో సోమవారం విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి నిత్యం యోగా చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ నరసింహం మాట్లాడుతూ చాలా మంది మానసిక, శారీరక ఒత్తిడికి గురై అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ధ్యానం చేయడంతో మన మైండ్ రిలీఫ్ అవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఎ.కిరణ్‌కుమార్, ఫిజికల్ డైరెక్టర్ బీసీహెచ్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానంపై శిక్షణ



కన్నూరుపాలెంలో ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బందికి ధ్యానంపై శిక్షణ

కశింకోట : మండలంలోని తీడ, ఇ.చౌడువాడ(కన్నూరుపాలెం) గ్రామాల్లో రామచంద్ర మిషన్ వారి ఆధ్యాత్మిక ధ్యాన శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి ధ్యానంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, డ్వాక్రా సభ్యులకు ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. మిషన్ సభ్యులు మురళి, మాధవి, ఐఎస్ రాజు తదితరులు కార్యక్రమంలో శిక్షణ ఇచ్చారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మునగపాక : ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోరారు. తోటాడ సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను ఆమె పరిశీలించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఇంటింటికీ వైద్య సేవలందించేలా ఫ్యామిలీ డాక్టర్ విధానం అందుబాటులోకి తెచ్చారన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్, సీహెచ్‌వో దేవకాంత తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

టర్కీ, సిరియా మృతులకు నివాళి



తెల్లబెలూన్లతో నివాళులర్పిస్తున్న విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : టర్కీ, సిరియాలో సంభవించిన భూకంపంలో అశువులు బాసినవారి ఆత్మకు శాంతి చేకూరాలని హ్యాపీ కిడ్స్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్‌కుమార్ సంతాపం ప్రకటించారు. స్థానిక ఉడ్‌పేట స్కూల్ ఆవరణలో సోమవారం సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనిఫాం ధరించిన చిన్నారులచే మృతులకు తెల్ల బెలూన్లు, కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి ప్రచారం

కశింకోట : స్థానిక కోమటి వీధిలో త్రైత సిద్ధాంత భగవద్గీత ఆధ్యాత్మిక గ్రంథంపై సోమవారం ధర్మ ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇందూ జ్ఞాన వేదిక వారి ప్రబోధ సేవా సమితి అనకాపల్లి కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి త్రైత సిద్ధాంతంపై అవగాహన కల్పించారు. దైవాన్ని పూజించడమే కాకుండా ఆయన అందించిన భగవద్గీత ద్వారా కర్మ విధానాన్ని అనుసరించాలన్నారు. భక్తియోగం ఆచరించి మోక్షం పొంది జనన మరణ చక్రం నుంచి విముక్తి చెందాలనేదే భగవానుని ఉవాచగా పేర్కొన్నారు. ఈ ప్రచారంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్, మణి, దేవి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గ్రావెల్ దందా!

సబ్బవరం: మండలంలోని అమృతపురం పరిసర ప్రాంతాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. అమృతపురం శివారు చింతగట్ల అగ్రహారం రెవెన్యూ పరిధిలో సోమవారం పట్టపగలు పొక్లెయిన్,మూడు ట్రాక్టర్లతో దర్జాగా గ్రావెల్ తరలించారు. జగనన్న కాలనీ దరి సర్వే నెం.39 లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా తవ్వకాలు చేపట్టారు. స్థానికులు మీడియాకు సమాచారం అందించారు. అక్కడకు వెళ్లి మీడియా ప్రతినిధులు వివరణ కోరితే జగనన్న కాలనీకి గ్రావెల్ తరలిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన ఎంపీటీసీ సింగంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలకు గ్రావెల్ అవసరం లేదన్నారు. కాలనీకి ఆనుకుని జరుగుతున్న బిల్డింగ్ నిర్మాణంతో పాటు పలు చోట్లకు గ్రావెల్ తరలిస్తున్నట్లు చెప్పారు.

అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం రెవెన్యూ పరిధిలోని భూదేవి చెరువును ఆనుకుని ఉన్న నల్లకొండ అటవీ ప్రాంతంలో సోమవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. ఇవి వ్యాపించడంతో సమీపంలోని సుమారు 4 ఎకరాల్లో విస్తరించి ఉన్న అకేషియా తోటతో పాటు జీడి, జీడి మామిడి తోటలు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఉపసర్పంచ్ బుదిరెడ్ల కనకరాజు గ్రామస్తులతో కలిసి వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంటలు మరింత వ్యాపిస్తుండడంతో సబ్బవరం అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందితో కలిసి గ్రామస్తులు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపు చేసినట్లు తెలిపారు. అయితే చిన్నచిన్న మంటలు ఇంకా రావడంతో అటవీ అధికారులకు సమాచారం అందించారు. మంటలు ఎలా వచ్చాయన్నది తెలియాల్సి ఉందని అధికారులు చెప్పారు.